క్లుప్తంగా

పోలీస్ ప్రజావాణికి 100 ఫిర్యాదులు



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 100 ఫిర్యాదులను అందినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఉదయరాణి తెలిపారు. ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలపై 48మంది, కుటుంబ కలహాలపై 18, మహిళా సంబంధిత నేరాలపై 9, మోసాలపై 11, ఇతర వివాదాలపై 14మంది ఫిర్యాదులు అందజేశారని వివరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ షన్ అధికారులను ఆదేశించినట్లు డీసీపీ తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో అమరావతి 'ఐ' హాస్పిటల్ సహకారంతో గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్యసేవా శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ నేత్ర వైద్యశిబిరాన్ని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు జీబీవీ రవికుమార్ ప్రారంభించారు. అమరావతి ఐ హాస్పిటల్ వైద్యులు , సిబ్బంది పాల్గొని చాంబర్ సభ్యులు, వివిధ వ్యాపార సంస్థల సిబ్బంది, ముఠా కార్మికులు కలిపి మొత్తం 150మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ శ్రీకాంత్, కమిటీ సభ్యులు కొత్త దుర్గా శ్రీనివాస్, జాలాది వెంకటేశ్వరరావు, ఎం.రామగోపాలరావు, మాజేటి చంద్రమోహనరావు, హాస్పిటల్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీ కాంతశర్మ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడులో కార్డన్ సెర్చ్



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ కేజీవీ సరిత, సెంట్రల్ ఏసీపీ కే దామోదరరావుతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీసీపీ సరిత మాట్లాడుతూ రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీయడం జరిగిందన్నారు. అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఇకపై నిత్యం ముఖ్య ప్రదేశాల్లో కార్డన్ సెర్చ్, ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ధైర్యంగా అడుగులు వేస్తే విజయాలు సొంతం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువత వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో భయపడకుండా ధైర్యంగా అడుగులు వేస్తే విజయాలు వరిస్తాయని ఫెడరేషన్ ఆఫ్ ఏపీ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ సూచించారు. పొట్టిశ్రీరాములు, చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంట్రపెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ క్రియేషన్ అండ్ ఇన్నోవేషన్ డేను పురస్కరించుకొని 'ఫ్రమ్ ఐడియాస్ టూ ఇంపెక్ట్ – ది పవర్ ఆఫ్ ఇన్నోవేటివ్ ఎంట్రపెన్యూర్‌షిప్' అంశంపై కళాశాలలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వాసిరెడ్డి మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయాలు, స్టార్టప్ సాధ్యత, మార్కెట్ అవసరాలను గుర్తించి వినూత్న పరిష్కారాలను రూపొందించాలని సూచించారు. యువత వ్యాపార దృక్పథాలను పెంపొందించుకొని సృజనాత్మకంగా లోచనలు చేస్తే విజయాలు సొంతం అవుతాయని స్పష్టంచేశారు. ప్రతి రంగంలోనూ అపజయాలు ఉంటాయని, వాటికి భయపడితే ఏ రంగంలోనూ విజయాలు ఉండవని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో దేశ అభ్యున్నతికి యువ ఆవిష్కర్తల పాత్ర చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, అధ్యాపకులు వై.సుధచంద్ర, వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎన్.శివగోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ స్టేడియంలో దాహం కేకలు

- మూలనపడిన ఆర్వో ప్లాంట్
- అందుబాటులో లేని తాగునీరు
- ఇబ్బందుల్లో క్రీడాకారులు, వాకర్స్



స్టేడియంలో పనిచేయని ఆర్వో వాటర్ ప్లాంట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో క్రీడాకారులు, చిన్నారులు, వాకర్స్ అవస్థలు పడుతున్నారు.స్టేడియంలోని ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదు. ఇక తాగునీటి పంపుల్లో నుంచి వస్తున్న నీరు దుర్వాసన వస్తుండటంతో క్రీడాకారులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు.

సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరికి అందుబాటులో ఉండే సింగ్‌నగర్ ఎంబీ స్టేడియానికి ఉదయం, సాయంత్రం వేళ్లలో పెద్దసంఖ్యలో జనం తరలివస్తుంటారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవు రోజుల్లో చిన్నారులు, యువత అధికసంఖ్యలో వస్తుంటారు. తమ స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి నిత్యం వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం ఇక్కడి వస్తుంటారు. ఆటలాడి, వ్యాయామాలు చేసిన తర్వాత గొంతు తడుపుకునేందుకు స్టేడియంలో గుక్కెడు నీళ్లు అందుబాటులో ఉండకపోతుండటంపై జనం పెదవివిరుస్తున్నారు.

గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం..

ఎంబీ స్టేడియంలో పాదచారులు, చిన్నారులు, క్రీడాకారులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఆకాంక్షతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో 2021 డిసెంబర్ నెలలో స్టేడియం ఆవరణలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటర్‌ప్లాంట్ నిర్వహణను గాలికొదిలేసింది. దీనికితోడు గతేడాది బుడమేరు వరదల దెబ్బకు ఆర్‌ఓ ప్లాంట్ మూలనపడింది. ఏడునెలలుగా ఈ ప్లాంట్ మర్మతులను పట్టించుకునే వారే కరువయ్యారు. అప్పటి నుంచి స్టేడియంకు వస్తున్న వారంతా ఆ పైపుల్లో నుంచి వస్తున్న నీటినే తాగేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే అవి కూడా సరిగా రాకపోతుండటం, వచ్చినా దుర్వాసన వెదజల్లుతుండటంతో తాగడం మానేశారు. వాటర్‌ప్లాంట్‌ను బాగుచేయించాలని.. తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కూడా పట్టించుకోవడం లేదని క్రీడాకారులు, పాదచారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుత ఎండా కాలాన్ని.. వేసవి సెలవుల్లో స్టేడియంకు వస్తున్న చిన్నారులను దృష్టిలో ఉంచుకొని అయినా వాటర్‌ప్లాంట్‌ను బాగుచేయించాలని.. లేనిపక్షంలో కనీసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో పెడుతున్న చలివేంద్రాలను స్టేడియం వద్ద కూడా ఏర్పాటు చేయాలని వాకర్స్, క్రీడాకారులు, చిన్నారులు కోరుతున్నారు.



తాగేందుకు వీలుగా లేని పైపుల్లో వచ్చే నీరు

నీటిని కొని తాగుతున్నాం...



స్టేడియంలో ఆడుకునేందుకు ఉదయం, సాయంత్రం వస్తున్నాము. ఆడి అలసిపోయి నీళ్లు తాగుదామని వస్తే నీళ్లు దుర్వాసన వస్తున్నాయి. దీంతో అప్పటి నుంచి బయట దుకాణాల వద్దకు వెళ్లి మంచినీళ్లు డబ్బులు పెట్టి కొనుక్కొని తాగుతున్నాం. – వి.అభిషేక్, ప్రణవి, అన్నాచెల్లెళ్లు

ఎప్పుడు వస్తాయో కూడా తెలీదు..



హాకీ నేర్చుకునేందుకు స్టేడియంకు వస్తున్నాను. మంచినీళ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. స్టేడియంలో ఉన్న ఈ పంపుల్లో ఎప్పుడు నీళ్లు వస్తాయో.. ఎప్పుడు రావో కూడా తెలిచడం లూదేజ ఇంటి దగ్గర నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం. అవి అయిపోతే బయటకు వెళ్లి కొనుగోలు చేయక తప్పడం లేదు. – జి.ఉమామహేశ్వరరావు, హాకీ క్రీడాకారుడు

హోంమంత్రి ఇలాకాలో మందుబాబుల ఆగడాలు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మహిళలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రామవరప్పాడులో రింగ్ సమీపంలో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారంటూ స్థానికులు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఇతర పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. రింగ్‌కు అరకిలోమీటరు దూరంలోని విల్లాల్లో ఉంటున్న వీరంతా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రామవరప్పాడులో రోడ్డు పక్కనే కల్లు దుకాణాలు ఉండటంతో కల్లు సేవించిన వారు రోడ్లపై అల్లర్లు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మందుబాబులు రోడ్లపై వాహనాలకు అడ్డంగా తిరుగుతున్నారని, మరికొందరు విల్లాలకు సమీపంలోనే తాగి పడిపోతున్నారన్నారు. మహిళలు, పిల్లలు వీరి ఆగడాలకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విల్లాలకు సమీపంలో మందుబాబులు చేస్తున్న ఆగడాలను అరికట్టాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.



మందుబాబుల ఆగడాలపై కలెక్టర్ లక్ష్మీశకు విన్నవిస్తున్న విల్లా వాసులు

అయితే రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితతోపాటు పలువురు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఈ విల్లాల్లోనే నివసిస్తున్నారు. ఎట్టకేలకు ఈ విల్లాల్లో ఉంటున్న మహిళలు, సీనియర్ సిటిజన్లు కలిసి మందుబాబుల ఆగడాలపై కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

రేపు బీచ్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: బీచ్ కబడ్డీ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను ఈనెల 23వ తేదీన గూడూరు మండలం మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి.రవిబాబు తెలిపారు. 85 కేజీల్లోపు బరువు ఉన్న పురుషులు, 75 కేజీల్లోపు బరువు ఉన్న మహిళలు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆరోజు ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9704063555 నంబరును సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు మే 2వ తేదీ నుంచి కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని రవిబాబు వివరించారు.

క్రీడా కోటా పెంపుపై హర్షం

విజయవాడస్పోర్ట్స్: క్రీడా కోటాను రాష్ట్రప్రభుత్వం రెండు నుంచి మూడుశాతానికి పెంచడంపై ఏపీ పీఈటీ, ఎస్‌ఏపీఈ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, కరీముల్లా సోమ వారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వశాఖలోనూ నేరుగా క్రీడాకారులు ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. రోజుల్లో రాష్ట్రంలో క్రీడాంధ్రప్రదేశ్, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పెనమలూరు: డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని ఎంపీడీఓ బండి ప్రణవి తెలిపారు. సోమవారం ఆమె వివరాలు తెలుపుతూ ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు టెట్ అర్హత సాధించాలని, బీసీ, ఈబీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ కులాలకు చెందిన వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, టెట్ ఉత్తీర్ణత పత్రాలు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా

హనుమాన్‌జంక్షన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు నూజివీడు న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వీరవల్లి ఎస్ఐ శ్రీనివాసు సోమవారం తెలిపారు. గతేడాది మార్చి 20వ తేదీన బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం పరిధిలో 16వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తిని కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనపై శేరినరసన్నపాలెం వీఆర్‌వో జే సుధారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ కొక్కిలిగడ్డ మహేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై నూజివీడు న్యాయస్థానంలో విచారణ పూర్తి కావడంతో ముద్దాయి కొక్కిలిగడ్డ మహేష్‌కు 15 రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు.

26న ఎంఎస్‌ఎంఈ కనెక్ట్ కార్యక్రమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈనెల 26వ తేదీన ఎంఎస్‌ఎంఈ కనెక్ట్–2025 పేరిట ఎంఎస్‌ఎంఈ ఛాంబర్ ఆఫ్‌కామర్స్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చాబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ దాసరి దేవరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోరీ హాస్పిటల్ బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో 26వ తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. వ్యాపార పయనంలో అవసరమయ్యే సాహచర్యం, శిక్షణ, మార్గనిర్దేశం, మౌలిక సమాచారం ఈ శిక్షణలో అందిస్తున్నట్లు వివరించారు. ప్రముఖులు, అధికారులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు తదితర అంశాలపై అవగాహన కల్పించటంతో పాటు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాల కోసం 6305941717, 8919737517లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వాస్తవ ఘటనలకు అద్దం పట్టిన కవితాగానం

విజయవాడ కల్చరల్: పర్వతనేని బ్రహ్మయ్య, సిద్దార్థ విద్యాసంస్థలు 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముమ్మనేని సుబ్బారావు సిద్దార్థ కళాపీఠం, విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో నిర్వహించిన యువకవి సమ్మేళనం వాస్తవ సంఘటనలకు అద్దం పట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీనియర్ కవి డాక్టర్ రావులపాటి సీతారామారావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంపై మహాకవి శ్రీశ్రీ తనదైన ముద్ర వేశారన్నారు. తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ మహాప్రస్థాన కావ్యం పెద్ద పెనుసంచలనం సృష్టించిందన్నారు. శ్రీశ్రీ కవిత్వం భూమార్గం పట్టి భూకంపం సృష్టించిందని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో కవిత్వం రూపురేఖలే మారిపోయానని, ఎందరో యువకులు కవిత్వం వైపు మళ్లారని వివరించారు.

యువతరం కదిలింది..

సినీపాటల రచయిత కట్టా సిద్ధార్థ, యువ కవి తంగిరాల సోని, మాస్టర్ మైండ్స్ ఇంటర్ విద్యార్థిని పీఎస్ఎస్ చిన్మయి, కళాశాల డిగ్రీ విద్యార్థులు ఆర్.స్రవంతి, పి.ఎలిజిబెత్ రాణి, వైద్యవిద్యార్థిని నాగశెట్టి రూపశ్రీ, దంత కళాశాల విద్యార్థిని కుసుమమోనిషి, సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని జీ ధరణి, కేబీఎన్ కళాశాల అధ్యాపకుడు పవన్‌కుమార్, బీ భారతీబాయ్‌లు సమాజంలో నేడు జరుగుతున్న అనేక సంఘటలనలకు అక్షర రూపమిచ్చారు. కార్యక్రమంలో కళాపీఠం కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు సత్యశ్రీనివాస్, ఎస్.శివకుమార్ నిర్వహించారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ముగిసిన మహాసంప్రోక్షణ కుంభాభిషేకం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని గీతా మందిరంలో మూడు రోజుల పాటు జరిగిన మహాసంప్రోక్షణ కుంభాభిషేకం శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనంతో సోమవారం ముగిసింది. తిరుపతి యేర్పేడు శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, ఉత్తరాధికారి శ్రీ అనంగా నందగిరిస్వామి, వేద పండితుడు రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలో వైదిక సంప్రదాయాలను పాటిస్తూ వేద పండితులు శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనం నిర్వహించారు. గీతా మందిరంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడికి విశేష అలంకారాలు చేసి పవిత్రమైన పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనంతో పాటు శ్రీకృష్ణునికి నైవేద్యాలు సమర్పించే అవకాశం కల్పించారు. శ్రీ గీతామందిర మహాసంప్రోక్షణ కుంభాభిషేకం ముగిసిన అనంతరం శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి విశ్వాసం, ధర్మం, భక్తి శక్తి అనే అంశాలను ఉద్ఘాటిస్తూ స్ఫూర్తిదాయకమైన భక్తి ప్రసంగాన్ని అందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల తహసీల్దారు బీ సుగుణ, నున్న పోలీసు స్టేషన్ సీఐ పీ కృష్ణమోహన్ తదతరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురిచేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిట్టినగర్‌లోని పెనుమాక దేవదాసు వీధికి చెందిన తట్టపర్తి యామినికి గత ఏడాది డిసెంబర్‌లో తాడేపల్లిగూడెంనకు చెందిన నాగసాయితో వివాహమైంది. యామిని తల్లి మతాంతర వివాహం . ఈ విషయాన్ని నాగసాయి తల్లిదండ్రులకు ముందుగానే చెప్పారు. అయితే పెళ్లయిన రెండు నెలల నుంచి యామినికి అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. అత్త మంగమ్మ, ఆడపడుచు భవాని, ఆమె భర్త వినయ్ కుమార్ తరుచూ వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో యామినిని కాలువ వద్దకు తీసుకువెళ్లి 'దూకుతావా.. తోసేయమంటావా' అంటూ భర్త నాగసాయి వేధించాడు. అయితే చుట్టు పక్కల వారు ప్రశ్నించడంతో పక్కనే ఉన్న పోలాల్లోకి తోసేశాడు. ఫిబ్రవరిలో అర్ధరాత్రి ఇంటికి వచ్చి గొడవ పడి కొట్టడమే కాకుండా చేతికి ఉన్న గాజులతో గాయపరిచాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసి అత్తంటి వారి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకూ శాశ్వత పరిష్కారం అందించాలని నగరపాలక సంస్థ అధికారులను మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో ఆయా వివిధ ప్రాంతాల నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 ఫిర్యాదులు, పట్టణ ప్రణాళిక సంబంధించి అత్యధికంగా 13 అర్జీలు ఉన్నాయి. ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి మూడేసి అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

విజ్ఞాన యాత్రకు కార్పొరేటర్ల పయనం

పటమట(విజయవాడతూర్పు): దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న వివిధ నగరపాలక సంస్థల్లో జరుగుతున్న అభివృద్ధిని అధ్యయనం చేసేందుకు వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో నగర కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రకు బయలుదేరారు. వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద వారి బస్సును మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు 24 మంది, కూటమి నుంచి 17 మంది, ఇద్దరు కోఆప్టేడ్ మెంబర్లతో పాటు యాత్ర సమన్వయకర్తలుగా డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కరుణాకర్‌బాబు, పీఆర్‌ఓ రజియా షాబినా, మరో ముగ్గురు సహాయక సిబ్బందితో బృందంగా వెళ్తున్నారు. కార్పొరేటర్ల బృందం ఈ నెల 22న బెంగళూరు మునిసిపల్ కార్పొరేషన్, 23న మైసూర్ మునిసిపల్ కార్పొరేషన్, 26న మధురై మునిసిపల్ కార్పొరేషన్, 28న నాగర్ కోయిల్ (కన్యాకుమారి) మునిసిపల్ కార్పొరేషన్, 29న త్రివేండ్రం మునిసిపల్ కార్పొరేషన్, మే మూడో తేదీన కొచ్చిన్ నగరపాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి, వివిధ ప్రాజెక్టులను పరిశీలించనుంది. ఆయా నగరాల్లో ప్రజలకు అందించే సంక్షేమ పథకాల అమలు తీరు తదితర అంశాలను అధ్యయనం చేయనుంది.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

జీతాలు అందక అవస్థల్లో కార్మికులు

పాయకాపురం(విజయవాడరూర్): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు (అప్కాస్) ఈ నెలలో ఇంకా జీతాలు అందలేదు. ఏప్రిల్ నెల 20వ తేదీ వచ్చినా ఇంకా జీతాలు అందకపోవడంతో పూటగడవడం కష్టంగా మారుతోందని పారిశుద్ధ్య కార్మికులతోపాటు ఆయా విభాగాల్లో పనిచేస్తున్న ఆందోళన చెందుతున్నారు. చిరు ఉద్యోగులైనా మాకు కూడా నెలనెలా ఇంటి సరుకులు, కరెంటు బిల్లు, పాల బిల్లు, ఇంటి అద్దె, మహిళా కార్మికులకు అయితే డ్వాక్రా గ్రూపులకు సంబంధించి చెల్లింపులు ఉంటాయని చెబుతున్నారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ అవసరాల కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయక తప్పడం లేదని వాపోతున్నారు.

ఆరువేల మంది కార్మికులు..

విజయవాడ కార్పొరేషన్‌లో సుమారు 6వేల మంది కార్మికులు వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్నారు. వారిలో సుమారు 3400 మంది పారిశుద్ధ్య కార్మికులు, 300 మంది పార్కుల్లో పని చేసేవారు, యింకా వ్యాన్ డ్రైవర్లు, యూజీడి, డ్రింకింగ్ వాటర్, ఇంజిరింగ్ పలు విభాగాలలో పనిచేసే కార్మికులున్నారు. నెలకి 21వేల రూపాయల చెల్లింపులకుగాను పిఎఫ్, ఇఎస్ఐ కటింగ్ పోతే రూ.18వేలు మాత్రమే వారి చేతికి అందుతుంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం ఆయా డివిజన్లకు వెళ్లేందుకు కార్మికులకు రోజుకు రూ.100 వరకు ఖర్చవుతుంటాయి. ఈ ఖర్చులు భరించాలన్న సకాలంలో జీతాలు అందాలని కార్మికులు చెబుతున్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి తమకు జీతాలు వెంటనే అందజేయాలని వారు కోరుతున్నారు.



రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

జీతాలు ఇవ్వకపోతే ధర్నా చేస్తాం..

నెలలో 20రోజులు దాటినా కార్మికులకు ఇంకా జీతాలు వేయకపోవడం దారుణం. వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించాలి. ఆదశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాకు చేస్తాం. – బుద్దె రాజా, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి

29 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపట్టాభిరామచంద్రస్వామి, శ్రీప్రసన్నాంజనేయస్వామివార్ల దేవాలయం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 29వ తేదీ నుంచి మేనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు భూపాల్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ మంగళవారం ఉదయం 8గంటలకు మూలవరులు, ఉత్సవమూర్తులకు స్నపన కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 6గంటలకు యాగశాలలో ప్రాతఃకాల ఆరాధన, ఉదయం 7.30గంటలకు హోమం, పూర్ణాహుతి, నివేదన, గోష్టి ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మేనెల 1వ తేదీ గురువారం సాయంత్రం 7గంటలకు ఎదురుకోలు ఉత్సవం, 2న సీతారాముల కల్యాణం, తిరువీధి ఉత్సవం, 3న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకం , గరుడవాహనంపై ఊరేగింపు, 4న పుష్పయాగం , పవళింపు సేవ, 5వన అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రోజూ తెల్లవారుజామున సుప్రభాతసేవ, ప్రాతకాల ఆరాధన, నివేదన కార్యక్రమాలు ఉంటాయన్నారు.ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని భూపాల్‌రాజు కోరారు.

ధ్యానం, యోగ సాధనతో ఒత్తిడి దూరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నిత్యం ధ్యానం, యోగ సాధన ద్వారా ఒత్తిడి తీవ్రతను తగ్గించుకోవటం ఎంతో సులభమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు తుమ్మూరి దీప్తి సూచించారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ ఆఫ్ వెల్ బీయింగ్ అండ్ మైండ్ ఫుల్ నెస్ అంశంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి దీప్తి మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ వాడకం మితిమీరటం వల్ల మానసిక ఒత్తిడి పెరగుతోందన్నారు. దీనివల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గి చదువులో రాణించలేరన్నారు. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, చైతన్య క్రియా ధ్యానం సాధన చేయడం ద్వారా మెదడు క్రియలను అదుపులోకి తీసుకురావచ్చని సూచించారు. శ్వాస నియంత్రణ పద్ధతులు, క్రియా యోగ, ప్రాణిక్ హీలింగ్ అంశాలను ప్రయోగ పూర్వకంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్య క్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం .వేంకటేశ్వరరావు, కంప్యూటర్స్ విభాగాధిపతి పి.రవీంద్ర పాల్గొన్నారు.